# ఉదయ

వార్డు నెం. ఒకటిలో ఉన్నాడు డాక్టర్ ప్రభాత్. సాయంత్రం 5గం|| అవుతోంది. విజిటర్స్ వస్తారు పేషెంట్స్‌ని చూడటానికి. రోగులని పరామర్శించటం అయింది. ఇంక ఇంటికి వెళ్ళవచ్చు. ఈ రోజుకి డ్యూటీ ముగిసింది... మాగజైన్స్ తీసుకున్నాడు చేతిలోకి – ప్రభాత్ రూమ్‌లోంచి బయటకు వచ్చాడు. చకితుడై నిలబడి పోయాడు ఆ అమ్మాయిని చూసి. ఆ అమ్మాయి పన్నెండవ నెం. బెడ్ దగ్గర నిలబడి ఉంది.

ముఖంలో ఒక ఆనందం. స్టూలు బెడ్‌కి దగ్గరగా లాగి కూర్చుని, పడుకున్న ముసలాయనతో అంటోంది.

''చూశారా మీకు బాగయిపోయింది నేను చెప్పలేదూ. మీరు అనవసరంగా గాబరా పడుతున్నారని. ఈ కాలంలో గుండెనీ, బ్రెయిన్నీ అవలీలగా ఆపరేట్ చేసేస్తున్నారు డాక్టర్లు. ఒక చిన్న అల్సర్ అంటే వాళ్ళకి ఒక లెక్కా! మిమ్మల్ని మళ్ళీ మామూలు మనిషిని చేసేశారు. కొంచెం జాగ్రత్తగా భోజనం చెయ్యాలంటే, కొంచెం కారం, పులుపూ తగ్గించమని చెప్పండి మీ కోడలికి.''

ముసలాయన నవ్వాడు.

''బతికి బయట పడతాననుకోలేదు అంతా నీ మాట చలవే బంగారూ!'' అన్నాడాయన ఆ అమ్మాయి చెయ్యి మీద తన చేయి వేసి ప్రేమగా నిమురుతూ.

ప్రభాత్ ఆ అమ్మాయి ముఖంలో తృప్తినీ ఆనందాన్ని చూస్తున్నాడు.

అంతలో ఒక మధ్య వయస్కుడు వచ్చాడు... ముసలాయన కొడుకు.

''ఇంక మనం ఇంటికి వెళ్ళచ్చు నాన్నా. సామాన్లన్నీ ఇవేకదూ.'' అంటూ అక్కడసామాన్లన్నీ ఒక సంచిలో జాగ్రత్త చేశాడు. ముసలాయన హాస్పిటల్ డ్రెస్

విప్పి, కొడుకు తెచ్చిన పంచ, షర్ట్ వేసుకున్నాడు.

''వెళ్ళొస్తాను. బంగారూ.'' అన్నాడు. ఆ అమ్మాయి వేపుచూసి.

''వెళ్ళండి మళ్ళీ రానక్కర లేదు.'' అంది కిలకిలా నవ్వుతూ.

ముసలాయనా కొడుకూ ఇద్దరూ నవ్వారు. కొడుకు వెనకాల వెడుతూ ముసలాయన ఏదో బంధంలాగుతున్నట్లు వెనక్కి తిరిగి చూస్తున్నాడు.

ప్రభాత్ కూడా ఆ అమ్మాయి కోసం చూశాడు. అక్కడ లేదు. ఎటు పోయిందో.

''ఇంతలో మాయమైంది? దేవత కాదు గదా.''

ఆ ఆలోచనకి నవ్వుకుంటూనే వార్డు దాటి బయటికి వచ్చాడు.

హాస్పిటల్ ఆవరణంతా కలయజూశాడు. తను వెతుకుతున్న వ్యక్తి ఎక్కడా లేదు. ఇంటి మొహం పట్టాడు స్కూటరు ఎక్కి.

ఆ అమ్మాయి ఎవరు? ఆ ముసలాయనకి బంధువా? ఏమౌతుంది?

మొన్న కేబిన్‌లో కనిపించింది. ఒక చిత్రమైన కేసు.

ఎనిమిదేళ్ళుంటాయా పిల్లకి! పొట్ట ఆపరేషన్ చెయ్యాలి.

ఆ పిల్లకి నోట్లో వేలు వేసుకోవటం అలవాటుట. ఊరికే వేలు వేసుకోవటం కాదు. జడచివర వేలుకు చుట్టుకుని వేలు వేసుకుంటుందిట. ఎప్పటినుంచీ ఉందో అలవాటు ఎవరూ గమనించలేదు కాబోలు.

కడుపు నొప్పికి పరీక్ష చేస్తే పేగులకి జుట్టు చుట్టుకుపోయి ఉందని తేలింది. ఆపరేషన్ అయింది. పిల్లకి తెలివి వచ్చింది. చూడటానికి వెళ్ళాడు అప్పుడు అక్కడ చూశాడు ఈ అమ్మాయిని. ఆ అమ్మాయి చుట్టూ ఏదో ఆకర్షణ! ఎక్కువ పొడుగు కాదు, లావు కూడా లేదు. పొట్టి జడ, చివర రబ్బర్‌బండ్ తగిలించి ఉంది. చిన్న ప్రింట్ ఉన్న తెల్ల చీర కట్టుకుంది. అతికినట్లున్న జాకెట్, తీరుగా కట్టిన చీర. అప్పుడే విచ్చుకుంటున్న జాజి పువ్వులాగ ఉంది! ఆ పిల్ల తల్లితో అంటోంది.

''మీరు అట్లాగ చూడక పోవటమేమిటి ఆంటీ. పిల్లలకి ఒక చెడ్డ అలవాటు ఉంటే ఎంత కష్టపడైనా సరే దానిని మాన్పించాలి. ఊరికే నోట్లో వేలు వేసుకున్నా ఊరుకోకూడదు. పళ్ళెత్తవుతాయి. పెళ్ళికాదు. నత్తి కూడా వస్తుంది. పోనీలెండి. దేవుడి దయవల్ల ఆపరేషన్ అయిపోయింది. గండం గడిచింది. ఇంకేం భయంలేదు. చిట్టితల్లి నాలుగు రోజుల్లో ఇల్లంతా సందడి చేసేస్తుంది మళ్ళీ.''

అని నవ్వింది. వెలిగించిన ప్రమిద తెచ్చి చీకట్లో పెట్టినట్టుందా నవ్వు.

ఆ అమ్మాయి పిల్లకేమౌతుంది?

తన గుండె తలుపులు తెరుచుకుని లోపలికి వచ్చి తనని చూసి నవ్వుతున్నట్లుగా సంభ్రమంగా, ఏదో కలవరంగా ఉంది ప్రభాత్‌కి

ఆ అమ్మాయి ఎవరు? తెలుసుకోవాలని ఉంది అతడికి.

విజిటర్స్ వచ్చే వేళయింది, హాస్పిటల్ డ్యూటీ ముగిసింది.

ఇంక ఇంటికెళ్ళవచ్చు. ప్రభాత్ వామప్ గదిలోంచి ఒకటవ నెంబర్ వార్డులోకి వచ్చాడు. అతడి కాళ్ళు ఆగిపోయాయి. కళ్ళు వెతకటం ప్రారంభించాయి. ఎవరెవరో వస్తున్నారు. ఆ అమ్మాయి కాదు. ఎవరో పెద్దావిడ... ఎవరో ముసలాయన... ఈ అమ్మాయి కాదు. ఆ నడక వేరు. జడ అంత పొడుగుండదు... ఎంతమంది జనం... తప్పి పోదుకదా... అకస్మాత్తుగా అతడి చూపులు నిలిచిపోయాయి. – ఆ అమ్మాయిమీద. వస్తోంది, వచ్చేస్తోంది. నీలి పూలున్న తెల్ల చీర– అమ్మాయి చుట్టూ ధవళ కాంతులు– చకచకా వచ్చేస్తోంది.

వచ్చింది. దగ్గరగా వచ్చి తనని దాటి వెళ్ళిపోయింది. వెళ్ళి ఐదవ నెంబర్ బెడ్ దగ్గర ఆగింది. ఇటూ అటూ చూస్తోంది. కలవరంగా. పాపం, అతను ఏమౌతాడో? హార్ట్ పేషెంట్.

అటూ ఇటూ చూసి అటువస్తున్న నర్సు దగ్గిరికి నడిచింది.

''సిస్టర్ ఐదవ నంబర్ బెడ్ అంకుల్ ఏరీ? ఇంకా కొన్నాళ్ళుండాలన్నారు కదూ!'' సిస్టర్ ఇంటికి వెళ్ళే హడావిడలో ఉంది కాబోలు.

''ఆయనా! పొద్దున్న పోయాడు. వాళ్ళవాళ్ళు బాడీని తీసికెళ్ళిపోయారు'' అంటూ వెళ్ళిపోయింది.

ఆ అమ్మాయి అక్కడే నిలబడిపోయింది. ఒక్కసారిగా ఆ మొహంలో కళంతా తీసేసినట్లయింది. చూపులు స్తంభించి పోయాయి. నిముషం సేపు వెంటనే వెళ్ళి ఆ బెడ్ దగ్గర ఉన్న స్టూలు మీద కూచుంది.

చేతులతో గట్టిగా కళ్ళు మూసుకుంది.

ప్రభాత్‌కి భయం వేసింది. ఆ అమ్మాయికేం కాలేదు కదా? ఫెయింటవుకుండా? సిస్టర్ విమలని పిలిచాడు.

''ఆ అమ్మాయికేం కాలేదు కదా. ఎవరా అమ్మాయి?''

సిస్టర్ విమల చకచకా ఆ అమ్మాయి దగ్గరికి వెళ్ళింది. భుజంమీద చెయ్యేసింది.

''నువ్వా ఉదయా! ఏమైంది? వొంట్లో బాగుండలేదా?''

ఆ అమ్మాయి కళ్ళు తెరిచింది.

''నాకు బాగానే ఉంది సిస్టర్ రెండు నిముషాలు ఇట్లాగే కూచుంటాను!''

మనసులో ఏదో బాధ అనిపించింది ఔను. మనుషులు చచ్చిపోతుంటారు కదూ! జబ్బు చేస్తే కొంతమందికి నయమౌతుంది, మళ్ళీ కోలుకుంటారు. కొంతమంది తప్పించుకోలేరు. ఓడిపోతారు. మృత్యువు చేతిలో చిక్కిపోతారు. ఈ లోకంనించి వెళ్ళిపోతారు...'' అంటూ లేచి నిలబడింది.

మళ్ళీ ఆ బెడ్ వంక ఒకసారి చూసింది భారంగా అడుగులు వేసుకుంటూ వార్డ్ బయటికి నడిచింది.

''సిస్టర్, ఆ పోయినతడు ఏమౌతాడు ఆ అమ్మాయికి?'' అనడిగాడు ప్రభాత్.

''ఏమీ కాడు. ఉదయ ఇక్కడికి ఊరికే వస్తుంది. ఏడాది క్రిందట ఒక సారి ఇక్కడ పేషెంట్‌గా ఉంది. అందరినీ పరామర్శించేది. జబ్బు నయమై ఇంటికి వెళ్ళినా రోజూ రావటం మొదలు పెట్టింది. ఇల్లు కూడా దగ్గరే వాళ్ళింట్లో వాళ్ళు ఆ అమ్మాయికి చెప్పలేక వదిలేశారు'' అంది సిస్టర్.

విచిత్రంగా అనిపించింది. ఎవరైనా సినిమాలకి, స్నేహితుల దగ్గరికి వెడతారు కాలక్షేపానికి. ఈ అమ్మాయి హాస్పిటల్‌కి రావటమేమిటి?

గబగబా బయటికి వచ్చాడు ప్రభాత్ కారిడార్స్ అన్నీ విజిటర్స్‌తో నిండిపోతున్నాయి. నీలం పూలున్న తెల్ల చీర కోసం వెతుకుతున్నాడతడు.

వెళ్ళిపోయిందా? కనిపించదా? ఎక్కడ మాయమైంది?

మెట్లుదిగి ఆవరణలో నడుస్తున్నాడు. ఇటూ అటూ సీజన్ ఫ్లవర్స్. అక్కడక్కడ సిమెంట్ బెంచీలు... ఒంటరిగా కూచుంది. సిమెంట్ బెంచీ మీద నీలం పూల తెల్ల చీరలో ఆ అమ్మాయే, ఉదయ దయవున్న ఉదయ. పేరు బాగుంది మనిషిలాగే నీట్‌గా... ధవళ కాంతులు జల్లుతూ... మనసు మాత్రం విచలితం కాబోలు ఎదుట నిలబడ్డాడు అతడు. ఐనా అతడిని చూడటం లేదు.

''మీరు... ఇక్కడ కూర్చున్నారు?'' తడబడుతూ అన్నాడు ప్రభాత్.

తలెత్తి చూసింది ఆ చూపులు ఎదుట మనిషిని గుర్తించటంలేదు. కొంచెం తేనె రంగులో ఉన్న కనుపాపలు. మనుషులు ఎక్కడనుంచి ఈ భూమి మీదకి వస్తారో తెలీదు. ఆ దృశ్యంలోంచి చూస్తున్నట్లు చూపులు. ఆ చూపుల్లో మట్టికి అర్థం, అందం ఇచ్చి మనిషిని చేసేది అదే అనిపిస్తున్నట్లు కరుణ.

''ఇంటికి వెళ్ళాలనిపించలేదు. కూర్చున్నాను.'' జవాబుగా అంది.

తను మాట్లాడుతున్నది ఒక యువకుడితో అనే చైతన్యం కనిపించటంలేదు మనిషిలో.

''మీ పేరేమిటి?'' ప్రశ్నించాడు ప్రభాత్.

పేరు తెలిసినా, పలకరించాలని, ఏదో మాట్లాడాలని అతడిలో ఉత్కంఠ.

''ఉదయ...'' ఇంకా అదే పరధ్యానం యాంత్రికమైన జవాబు.

''మిమ్మల్ని ఇక్కడ చాలా సార్లు చూశాను, ఇంచుమించు రోజూ. ఆ కాబిన్‌లో ఆపరేషన్ అయిన పాప మీకేమౌతుంది? పాపం ఇవేళ పొద్దున్న పోయాడతను. హార్ట్‌పేషంట్... మీకు దగ్గర బంధువా?''

మాట్లాడుతున్నాడు కానీ అతడికి ఇబ్బందిగా ఉంది మాట్లాడటం... సిగ్గుగా సంకోచంగా తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రయత్నిస్తున్నాడు మాటలు.

తలెత్తి ఈసారి అతడి మొహంలోకి చూసింది. అతడి మాటలకి ఏం స్ఫురించిందో ఫకాలున నవ్వింది. అమాయకుడ్ని చూచినట్లు చూస్తూ.

''ఆ. బంధువులే. ఆత్మబంధువులు'' అంది.

''అంటే... మీకేం కారా? ఇంకా అతడి మొహంలో అర్థం చేసుకోలేని అమాయకత్వమే.

ఉదయ నవ్వటం మానేసింది.

''ఆత్మబంధువులని చెప్పటం లేదూ. అందరం మనుషులమే. అందరికీ ఏవేవో అందుకోవాలని ఆరాటం. కానీ ఆ దేవుడు అందుకోనీడు. — కొందరికి జబ్బులు, కొందరికి మానసిక వ్యాధులు ప్రసాదిస్తాడు. ఎవరైనా సుఖంగా ఉంటే చూడలేడు. కొందరిని సగంలో ఆటనించి లేపినట్లు తన దగ్గరికి పిలుచు కుంటాడు. అకస్మాత్తుగా ఏం చెయ్యలేక మనం. అందరం అంతే ఏమీ చెయ్యలేం. అందరం మనుషులం. ఇదే మన బంధుత్వం నిస్సహాయులం....''

ప్రభాత్ ఆ అమ్మాయి వంక ఆరాధనా పూర్వకంగా చూస్తున్నాడు.

''మీకు ఈ రోగులూ, హాస్పటల్ చూడటానికి చిరాకూ ఉండదూ'' అనడిగాడు.

''మన బలహీనతలని చూసుకుని చిరాకు పడితేనూ, అసహ్యించుకుంటేను ఏం లాభం? చేతనైతే బలహీనతని జయించాలి. కానీ మనిషి జబ్బులు రాకుండా చేసుకోలేడు. జబ్బుని నివారించుకోగలిగినా మృత్యువునింకా జయించలేదు కదూ. ఈ శరీరంలో ఎన్ని భాగాలూ, ఎంత కార్యక్రమం! అంతా క్రమగతిలో పనిచెయ్యటం మహాద్భుతం. అసంభవం కనక ఏదో ఒకటి రావటమే సహజం, దానిగురించి భయపడి, బాధపడి లాభం లేదు. కావలసింది ఒక్కింత సానుభూతి, మరింత శుశ్రూష.

''మీరు ఇట్లాగ వస్తే మిమ్మల్ని ఇంట్లో ఏమీ అనరూ?''

మళ్ళీ అదే నవ్వు – అమాయకుణ్ణి చూసినట్లు... నవ్వింది.

'ఎందుకనరూ? సిగ్గు లేదూ, భయం లేదూ అని అడిగి అడిగి అమ్మ విసిగిపోయింది. ఏం చెయ్యనూ రాకుండా ఉండలేను ఏదో బాధ ఉంటేనే వస్తారిక్కడికి పాపం! ఇన్ని రకాల బాధలు దేవుడెందుకు పెట్టాడో? ఇంత అందంగా సృష్టించిన ఈ లోకంలో మనిషికి ప్రేమ, అందం, మనసూ అన్నీ పెట్టి పుట్టించి, వాళ్ళ ఆశలన్నీ పుటుక్కుని తెంపేస్తాడు ఏదో ఒక అనారోగ్యం ప్రసాదించి.''

''మీరు చదువుకుంటున్నారా?''

''స్వస్తి చెప్పేశాను, నా మాట అది వినదని దానిమాట నేను వినటం మానేశాను.''

ఆ అభిమానం చూసి నవ్వు వచ్చింది ప్రభాత్‌కి.

మీరిట్లాగ ఇక్కడికి వస్తుంటే...'' తర్వాత ఏమని అడగాలో సంశయిస్తున్నాడు.

''ఓ అదా! ఎవరేనా ఏమైనా అంటారనా? అటువంటి భయం నాకు లేదు. నేను పెళ్ళి చేసుకోను. పెళ్ళయితే భర్త ఏమంటాడో, ఏమనుకుంటాడో అని భయపడాలి. పెళ్ళే చేసుకోకపోతే ఏ బాధా ఉండదు. ఎవరికీ భయపడనక్కర్లేదు, నాకసలు పెళ్ళెందుకూ? ఆయాసం వస్తుంది. చేసుకునేవాడు సుఖపడాలని చేసుకుంటాడు పెళ్ళి. అటువంటివాడిని నా రోగంతో బాధపెట్టలేను. భార్యతో సరదాగా తిరగాలని, కాలక్షేపం చెయ్యాలని ఉంటుంది అతడికి. దగ్గుతూ, పక్కమీంచి లేవలేకుండా పడుకుని ఉంటాను నేను. అట్లాగ ఇంకొకరి సంతోషాన్ని చంపలేనండీ నేను. పెళ్ళి కాకపోతే మానె.''

''ఆయాసానికి మందులున్నాయ్. ఇప్పుడు మీరు బాగానే ఉన్నారు!'' ధైర్యం చెప్పబోయాడు.

''ఇప్పుడు లేదు కానీ మళ్ళీ వస్తుంది. అది మందుకి లొంగేది కాదులెండి. వస్తా. బై...బై...'' వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది. ప్రభాత్ అక్కడే ఐదు నిముషాలు నిలబడ్డాడు.

డాక్టర్‌గా చేరి ఏడాదయింది. ఎన్నో సంబంధాలు వస్తున్నాయి. అమ్మాయిలు గ్రాడ్యుయేట్లు, పోస్టుగ్రాడ్యుయేట్లు. పదివేలు మొదలు పాతిక దాకా కట్నం ఇస్తామని వస్తున్నారు. ''ఊ'' అనటానికి తనకే భయంగా ఉంది, డాక్టర్ వృత్తిలో ఉండి చదువుకున్న భార్యని తృప్తి పరచాలదా అని. తన భార్య ఉద్యోగం చెయ్యక్కరలేదు. ఊళ్ళేలక్కరలేదు. ఇల్లా ఉండి పిల్లల్ని చూసుకుంటే చాలు. ఎక్కడికెళ్ళావ్ ఎప్పుడొస్తావ్ అని అడగకుండా ఉంటే చాలు. అవసరమైతే పనివాళ్ళని కూడా పెట్టగలడు. కానీ ఈ అభిప్రాయం పైకి చెప్పటానికి భయంగా ఉంది. ఎమ్మేలు, యంబిలు చదివిన పిల్లలు నోరు

మూసుకుని ఇంట్లో కూర్చుంటారా? ఇద్దరూ ఉద్యోగాలు చేస్తుంటే ఇంటిని, పిల్లల్ని ఎవరు చూస్తారు? అందులో డాక్టర్కి ఏమాత్రం తీరిక ఉండదు.

ఆ మధ్య ఒక సంబంధం వచ్చింది. ఎమ్మే చదివిన పిల్ల వద్దంటే వదిన ఒకటే నవ్వు ''ఏ కాలంలో ఉన్నావయ్యా ప్రభాత్కుమారా?'' అంటూ.

గట్టిగా పట్టుబడితే అన్నయ్య వదినా కాదనరు. నీయిష్టం అంటారు.

తను డాక్టరు! ఇటువంటి సానుభూతి ఉన్న అమ్మాయిని చేసుకుంటే?

చేసుకుంటే అన్ని విధాలా కలిసి వస్తుంది. ఉదయని తను జాగ్రత్తగా చూసుకోగలడు.

ఈ అమ్మాయినే చేసుకోమని గట్టిగా చెప్తోంది మనసు.

* * * *

నవ్వింది ఉదయ అదే సిమెంట్ బెంచి మీద కూచుని ఉంది. ప్రభాత్ నిలబడే ఉన్నాడు. వాకబు చేసి ఉదయ కుటుంబం గురించి తెలుసుకున్నాడు. అతడికేమీ అభ్యంతరం చెప్పాల్సిన విషయం కనిపించలేదు. నాలుగు రోజులు ఆలోచిస్తూ, తనలో తాను మధుర భావనలు అల్లుకుంటూ గడిపాడు. ఐదో రోజు విజిటింగ్ అవర్స్ అయిపోతుంటే వెళ్ళిపోతున్న ఉదయ వెనక వెళ్ళి సిమెంటు బెంచి దగ్గర ఆపాడు. కూచోమని అడిగి తన అభిప్రాయం చెప్పాడు.

ఉదయ నవ్వింది. మొదటి సారి అతడి ప్రశ్నలకి నవ్వినట్లే నవ్వింది.

''పెళ్ళి చేసుకుంటారా నన్ను? థాంక్స్ మెనీ మెనీ థాంక్స్.. నాకొక చక్కని కల వచ్చినందుకు కృతజ్ఞురాలిని. నాకు కలలో తప్ప... ఇలలో పెళ్ళి జరగదు డాక్టర్'' అంది.

''పెళ్ళి చేసుకోకూడదని ఏ డాక్టరైనా చెప్పాడా?'' కోపంగానే అన్నాడు.

''ఏ డాక్టర్ చెప్పాలి? ఈ ప్రపంచాన్ని రోజూ చూడటంలేదూ! ఎంతెంత ఆశలు, ఏడుపులు...మోసాలు...సుఖంకోసం...స్వార్థంకోసం... వద్దండీ... నావలన ఎవరూ దగా పడకూడదు... వస్తా... థాంక్స్... నాకు చక్కటి కల ఇచ్చినందుకు''

ఉదయ లేచి వెళ్ళిపోయింది... ఆమె వెనకే నడిచి అడిగాడు.

''నిజంగా అంటున్నారా? ఇట్లాగ తిరస్కరించటానికి మీకు బాధగాలేదూ?''

ఉదయ నిలబడి అతడి కళ్ళలోకి చూసింది.

''యశోధరని రాహులుణ్ణి వదిలి వెళ్ళటానికి సిద్ధార్థుడు బాధ పడలేదంటారా?'' అని అడిగింది.

అతడింకా ఆ ప్రశ్నకి జవాబు ఆలోచిస్తుండగానే అక్కడనించి వెళ్ళిపోయింది.

* * * *

''ఇవేళ బాగుందా వొంట్లో? మందులు వేసుకున్నావా? చల్లగాలిలో కూర్చోవద్దంటే వినవు!'' మందలిస్తున్నట్లు అన్నాడు ప్రభాత్.

అప్పుడే కారు దిగి లోపలికి వచ్చాడు. పూల చెట్లతో అందంగా ఉన్న పోర్టికోలో ఈజీ చైర్‌లో కూర్చుంది ఉదయ. షాల్ కప్పుకుంది భుజాల చుట్టూ.

''మీను మీ మాట ఎప్పుడో వినాల్సింది కాదు. విని పొరపాటు చేశాను. చల్లగాలి తగిలితే చచ్చిపోనులెండి. చచ్చిపోతే మంచిదే. అంత కంటె నేను కోరుకునేది లేదు. నాదగ్గర ఏముంది? వెళ్ళండి. నాకు మీ సానుభూతి అక్కర్లేదు. ఆనందాన్ని, నా సంతోషాన్ని అంతా దోచుకున్నారు. ఒక చిలకలా బంధించారు. మెడలో ఈతాడుతో – అంటుంటే ఉదయకి దగ్గు వచ్చింది.

అటువంటి మాటలు వినటం ప్రభాత్‌కి అలవాటే. నవ్వుతూ వెన్ను నిమిరి చెయ్యి అందించాడు. ఇద్దరూ లోపలికి వెళ్ళి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నారు. పనివాడు కాఫీ తెచ్చి అందించాడు.

తాగుతుంటే పిల్లలిద్దరూ ఆడుకోవటం అయి లోపలికి వచ్చారు. వాళ్ళతో ఒక అరగంట కాలక్షేపం చేసి మళ్ళీ ప్రభాత్ కారు తీసుకుని వెళ్ళాడు ఊళ్ళో పేషెంట్స్‌ని చూడటానికి.

ఉదయ తన గదిలోకి వెళ్ళింది. మంచం మీద కూర్చుంది. చేతిలోకి అల్లిక తీసుకుంది. ''లేదు నాకు చచ్చిపోవాలని లేదు. నేను అనేవన్నీ అబద్ధాలే ప్రభాత్.

నాకు మిమ్మల్ని, పిల్లల్ని వదిలి ఎక్కడికి వెళ్ళాలని లేదు. నా కెంత ఆనందాన్ని, సంతోషాన్ని ఇస్తున్నారో చెప్పలేను. ఇదంతా దూరమై పోతుందేమోనన్న భయంతో ఏవేవో అబద్ధాలన్నీ అంటాను. ఐనా మీరు ఏమీ అనరెందుకని?'' అనుకుంది తరచూ అట్లాగే అనుకుంటుంది.

నా ప్రభాత్ ఏరికోరి తనని ఎందుకు చేసుకున్నాడో ఉదయకి అర్థంకాదు. కానీ అతడి కళ్ళు ఆ భావాన్ని – ఆ రహస్యాన్ని ఎప్పుడూ వెల్లడిస్తూనే ఉంటాయి. అతడు ఉదయ వేపు చూస్తున్నప్పుడు అతడి కళ్ళని చూస్తే తెలిసిపోతుంది. ''ఎప్పుడూ నేనేమీ ఇవ్వలేకపోతున్నాను అనే ఆరాటం తప్ప మీరు నాకు ఏం ఇచ్చారు అనే ప్రశ్న లేదు నీలో ఉదయా!' అంటుంటాయి.

* * * *